RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ సంపుటి: 4 సంచిక:67 | బుధవారం ఫిబ్రవరి 18, 2026 | పేజీలు 8 వెల: రూ.3-00



## ‘ఉద్యమం’ పుట్టిన రోజు

- మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్న నమ్మకం ఉంది
- మాజీ మంత్రి హరీశ్ రావు
- తెలంగాణ భవన్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

# పేరుకే వరంగల్.. పెత్తనమంతా హన్మకొండదే!

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

**సాధారణంగా ఏ జిల్లాకైనా** ఆ జిల్లా పేరున్న పట్టణమే పరిపాలనా కేంద్రంగా ఉంటుంది. కానీ, చారిత్రక నగరాలైన వరంగల్-హన్మకొండ విషయంలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నం. వరంగల్ అనేది కేవలం ఒక బ్రాండ్ నేమ్‌గా మాత్రమే మిగిలిపోగా, అసలైన అధికార పీఠం మాత్రం హన్మకొండలోనే తిష్టవేసింది. బ్రిటీష్, నిజాం కాలం నుండి నేటి కొత్త జిల్లాల ఏర్పాటు వరకు వరంగల్ జిల్లా పరిపాలన హన్మకొండ కేంద్రంగానే సాగడం ఒక విచిత్రమైన పరిణామం. కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్, కోర్టులతో పాటు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలన్నీ హన్మకొండలోనే కేంద్రీకృతమవ్వడంతో వరంగల్ ప్రాంతం కేవలం చారిత్రక కట్టడాలకు, నివాసాలకు పరిమితమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయం నుండి రియల్ ఎస్టేట్ వరకు.. అభివృద్ధి నుండి నిధుల మళ్లింపు వరకు అన్నీ హన్మకొండనే ‘పెత్తనం’ చెలాయిస్తోంది.

### ఉమ్మడి జిల్లాకే ‘పెద్దన్న’ పాత్ర

- కీలక కార్యాలయాలన్నీ అక్కడే
- విద్య, వైద్య రంగాలకు కేంద్ర బిందువు
- బిజినెస్, మాల్స్ అన్నీ హన్మకొండలోనే..
- రాజకీయ నాయకులకు నెలవు
- రాజకీయ ఆధిపత్యం కూడా ఇక్కడి నుంచే..
- అభివృద్ధి నిధుల విషయంలోనూ వ్యత్యాసమే



2లో




## లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు తెలంగాణ అగ్రగామి

- బయోఏషియా వేదికగా ప్రపంచ దిగ్గజాలతో సీఎం భేటీ
- భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక జోన్ ప్రతిపాదన
- జీనోమ్ వ్యాలీలో భారీ పెట్టుబడులు

2లో

## కాంగ్రెస్ గూండాల దాడి ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- రేవంత్ సర్కార్ అరాచకాలకు గుణపాఠం తప్పదు
- పోలీసుల లాఠీచార్జీ అమానుషం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మంచిర్యాలలో చైర్మన్ ఎన్నికల వాయిదాపై ఆగ్రహం




2లో

## మోసానికి మారుపేరు కాంగ్రెస్

- ఇచ్చిన హామీలు అమలు కాలేదు
- బడ్జెట్‌లో నిధుల కేటాయించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



2లో




## సంయుక్త ఆపరేషన్‌లో ఇద్దరు డ్రగ్ పెడ్లర్లు అరెస్ట్

- వంద ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం
- రూ.25 లక్షలకు పైగా విలువైన మాదకద్రవ్యాలు పట్టివేత
- మత్తుకు దూరంగా ఉండండి.. ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

2లో

## ఐబొమ్మ రవికి బెయిల్

- ప్రతిరోజూ సీసీఎస్ ఎదుట హాజరు కావాలని ఆదేశం
- పాస్‌పోర్టు సమర్పణ, ఇంటర్నెట్ వినియోగంపై పరిమితులు
- షరతులతో కూడిన నిర్ణయం




2లో



## దేవుడు మళ్లీ బతికిస్తాడని..!

- మృతదేహంతో నాలుగు రోజుల ప్రార్థనలు
- ఆలస్యంగా వెలుగులోకి..
- కూకట్‌పల్లిలో విషాద ఘటన

2లో

వేద న్యూస్

బుధవారం | ఫిబ్రవరి 18, 2026

## దేవుడు మళ్లీ బతికిస్తాడని..!

- మృతదేహంతో నాలుగు రోజుల ప్రార్థనలు
- ఆలస్యంగా వెలుగులోకి..
- కూకట్‌పల్లిలో విషాద ఘటన

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

నగరంలోని కూకట్‌పల్లి ప్రాంతంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. దేవుడు మళ్లీ బతికిస్తాడనే నమ్మకంతో కుమార్తె మృతదేహాన్ని ఇంట్లో ఉంచి కుటుంబ సభ్యులు నాలుగు రోజుల పాటు ప్రార్థనలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కైకలూరుకు చెందిన శమంతకమణి తన ముగ్గురు పిల్లలు జయరాం, శైలజ, సునీతలతో కలిసి కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో అద్దెకు నివసిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న శైలజ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందింది. అయితే ఆమె మరణాన్ని జీర్ణించుకోలేక కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చి తలుపులు మూసుకుని ప్రార్థనలు ప్రారంభించారు. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిపించి పరిస్థితిని పరిశీలించారు. కుటుంబ సభ్యుల మానసిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారి సమ్మతితో మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామమైన కైకలూరుకు తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## సంయుక్త ఆపరేషన్‌లో ఇద్దరు డ్రగ్ పెడ్లర్లు అరెస్ట్

- వంద ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం
- ఇరవై ఐదు లక్షలకుపైగా విలువైన మాదకద్రవ్యాలు పట్టివేత
- వ్యసనాలకు దూరంగా ఉండాలని పోలీసుల విజ్ఞప్తి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కొల్లూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, సెరిలింగంపల్లి ప్రత్యేక ఆపరేషన్స్ బృందం సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఇద్దరు డ్రగ్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ చర్యలో బస్వ జగన్నాథం, పల్లపు లక్ష్మీనారాయణలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మొత్తం వంద ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ సుమారు ఇరవై ఐదు లక్షల డెబ్బై రెండు వేల ఏడు వందల యాభై ఐదు రూపాయలుగా అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలకు సంబంధించి ఏవైనా సమాచారం ఉంటే ప్రజలు వెంటనే డయల్ వన్ జీరో జీరోకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అదనంగా సైబరాబాద్ మాదకద్రవ్య నిరోధక విభాగం ప్రత్యేక ఫోన్ నంబరు, వాట్సాప్ నంబరు ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి గోప్యతను పూర్తిగా కాపాడుతామని పోలీసులు స్పష్టం చేశారు.

## 'ఉద్యమం' పుట్టిన రోజు

- త్యాగాల పునాదులపై రాష్ట్ర సాధన స్మరణ
- మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్న నమ్మకం ఉంది
- మాజీ మంత్రి హరీశ్ రావు
- తెలంగాణ భవన్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, నేడు ఒక నాయకుడి పుట్టినరోజు మాత్రమే కాదని, ఇది తెలంగాణ ఉద్యమం పుట్టినరోజు అని వ్యాఖ్యానించారు. స్వేచ్ఛా వాయువులు పీల్చుతూ, ఆత్మగౌరవంతో తెలంగాణ ప్రజలు జీవిస్తున్నారంటే దానికి కారణజన్ముడు కేసీఆర్ అని హరీశ్ రావు పేర్కొన్నారు. ధర్మం దారి తప్పినప్పుడు దేవుడు దారి చూపిస్తాడని భగవద్గీతలో ఉందని, అలాంటి సమయంలోనే కేసీఆర్ ముందుకు వచ్చారని అన్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదాన్ని నిషేధించిన రోజుల్ని, ప్రాంతీయ అన్యాయాలను ఆయన గుర్తుచేశారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో జరిగిన అన్యాయాలపై పోరాడిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఎంతో మంది ఉద్యమం చేసినప్పటికీ గమ్యాన్ని చేరుకోలేకపోయారని, కానీ కేసీఆర్ మాత్రం "తెలంగాణ రావాలి లేక నేను లేను" అనే సంకల్పంతో ముందుకు సాగి రాష్ట్రాన్ని సాధించారని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి వంటి పదవులను త్యజించి తెలంగాణ కోసం తలపెట్టిన త్యాగాలను ఆయన ప్రస్తావించారు. నిరాహార దీక్ష సమయంలో నిమ్స్ ఆసుపత్రిలో ఉన్నప్పటికీ కేసీఆర్ చూపిన మొండి ధైర్యాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలనలో కూడా తన ముద్ర వేసిన నాయకుడు కేసీఆర్ అని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణకు పాలన రాదనే విమర్శల నుంచి దేశం అనుసరించే స్థాయికి తీసుకువచ్చారని అన్నారు. కార్యకర్తలను, నాయకులను తీర్చిదిద్దిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. ఓటమి తాత్కాలికమని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యే రోజు దూరంలో లేదని హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. అందరూ ఒక్క తాటిపై నడిచి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు అందరి తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పేరుకే వరంగల్.. పెత్తనమంతా హన్మకొండదే!



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

సాధారణంగా ఏ జిల్లాకైనా ఆ జిల్లా పేరున్న పట్టణమే కేంద్రంగా ఉంటుంది. కానీ వరంగల్ విషయంలో 'వరంగల్' అనేది ఒక బ్రాండ్ నేమ్ మాత్రమే, కానీ అధికార కేంద్రం మాత్రం హన్మకొండ. తెలంగాణలో మరే జిల్లాకు లేని విచిత్రమైన పరిస్థితి వరంగల్, హన్మకొండ జిల్లాల విషయంలో ఉంది. పేరుకే వరంగల్ జిల్లా.. పెత్తనం మాత్రం హన్మకొండది అనే విమర్శ దశాబ్దాలుగా వినిపిస్తూనే ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్నప్పుడు కూడా దాదాపు అన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు హన్మకొండలోనే ఉండేవి. ఉమ్మడి వరంగల్ కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్ హన్మకొండలోనే ఉంది. కాకతీయ యూనివర్సిటీ, కేయూసీ, నిట్ వంటివన్నీ హన్మకొండ పరిధిలోనే ఉన్నాయి. జిల్లా కోర్టు కూడా హన్మకొండలోనే ఉంది. దీనివల్ల వరంగల్ సిటీ ప్రజలు కూడా తమ చిన్న పనికైనా హన్మకొండకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ఉమ్మడి జిల్లాకే 'పెద్దన్న' పాత్ర

- కీలక కార్యాలయాలన్నీ అక్కడే
- విద్య, వైద్య రంగాలకు కేంద్ర బిందువు
- బిజినెస్, మాల్స్ అన్నీ హన్మకొండలోనే
- రాజకీయ నాయకులకు నెలవు
- రాజకీయ ఆధిపత్యం కూడా ఇక్కడి నుంచే..
- అభివృద్ధి నిధుల విషయంలోనూ వ్యత్యాసమే

### విద్యా, వైద్య రంగాల్లో హవా

ఏదైనా ఒక ప్రాంతం పవర్ సెంటర్‌గా ఎదగాలంటే అక్కడ విద్యాసంస్థలు ఉండాలి. కాకతీయ విశ్వవిద్యాలయం, నిట్, కేడీసీ, పింగళి కాలేజీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలన్నీ హన్మకొండలోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాకు తలమానికమైన ఎంజీఎం ఆసుపత్రి సాంకేతికంగా వరంగల్ సరిహద్దులో ఉన్నా, దాని అనుబంధ మెడికల్ కాలేజీలు, ఇతర యంత్రాంగం హన్మకొండపైనే ఆధారపడి ఉంటుంది. దీనివల్ల మేధావి వర్గం, విద్యార్థి లోకం అంతా హన్మకొండలోనే కేంద్రీకృతమయ్యారు.

### బిజినెస్ అంతా హన్మకొండ కేంద్రంగానే..

హన్మకొండలో ఉన్న అదాలత్, నక్కలగుట్ట, కిషన్ పురా ప్రాంతాలు అత్యంత ఖరీదైనవిగా మారాయి. షోరూమ్‌లు, మల్టీప్లెక్స్‌లు, హోటళ్లు అన్నీ ఇక్కడే వెలిశాయి. రియల్ ఎస్టేట్, వ్యాపారాలు, షాపింగ్ మాల్స్ అన్నీ హన్మకొండలో కేంద్రీకృతం కావడంతో అక్కడ అభివృద్ధి వేగంగా ఉంది. వరంగల్ ప్రాంతం కేవలం చారిత్రక కట్టడాలకు, రైల్వే స్టేషన్‌కు పరిమితం అయింది. వరంగల్ చౌరస్తా, లేబర్ కాలనీ, ఖిలా వరంగల్ వంటి ప్రాంతాలు కేవలం వ్యాపారాలకు, నివాసాలకు పరిమితమయ్యాయి తప్ప అధికార కేంద్రాలుగా ఎదగలేకపోయాయి.

### రాజకీయ నాయకత్వం.. క్యాంప్ ఆఫీసుల ప్రభావం

ఏ జిల్లాలోనైనా రాజకీయ చక్రం తిరగాలంటే నాయకులు ఎక్కడ ఉంటున్నారనేది ముఖ్యం. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రధాన నాయకులందరికీ హన్మకొండలోనే నివాసాలు ఉన్నాయి. జిల్లాకు చెందిన మంత్రి ఎవరైనా సరే, వారి అధికారిక నివాసం లేదా క్యాంప్ ఆఫీస్ హన్మకొండ పరిసరాల్లోనే ఉంటుంది. జిల్లా నలుమూలల నుంచి కాక జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ నుంచి వచ్చే కార్యకర్తలు, నాయకులు హన్మకొండకే వస్తారు. దీనివల్ల రాజకీయ చర్చలు, లాబీయింగ్, నిర్ణయాలన్నీ హన్మకొండలోనే జరుగుతాయి. వరంగల్ కేవలం ఒక నియోజకవర్గ కేంద్రంగానే మిగిలిపోవడానికి ఇది ఒక బలమైన కారణం.

### కొత్త జిల్లాల ఏర్పాటు.. గందరగోళం

2016లో జిల్లాల విభజన జరిగినప్పుడు ప్రభుత్వం వరంగల్‌ను రెండుగా విడదీసింది.. ఒకటి వరంగల్ అర్బన్. జిల్లాకేంద్రం హన్మకొండగా ఉండేది. వరంగల్ రూరల్ జిల్లా కేంద్రం వరంగల్ గా ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడే అసలు సమస్య మొదలైంది. వరంగల్ రూరల్ జిల్లాకు కలెక్టరేట్ లేదు, సరైన భవనాలు లేవు. దీంతో రూరల్ జిల్లా కలెక్టర్ కూడా హన్మకొండలోని పాత భవనాల్లోనే కూర్చుని పాలన సాగించేవారు. అంటే రెండు జిల్లాల పెత్తనం హన్మకొండ నుంచే సాగేది. అయితే.. ప్రజల విజ్ఞప్తులు, రాజకీయ కారణాల వల్ల ప్రభుత్వం తిరిగి పేర్లను మార్చింది. వరంగల్ అర్బన్ కాస్తా హన్మకొండ జిల్లా అయ్యింది. వరంగల్ రూరల్ కాస్తా వరంగల్ జిల్లా అయ్యింది. ప్రస్తుతం వరంగల్ జిల్లాకు కలెక్టరేట్ ఆజంజాహి మిల్స్ గ్రౌండ్స్‌లో కొత్తగా నిర్మిస్తున్నారు. అది పూర్తయితే తప్ప పరిపాలన పూర్తిగా వరంగల్ వైపు వెళ్ళదు. అంతవరకు వరంగల్ జిల్లా పరిపాలన కూడా హన్మకొండ కేంద్రంగానే నడుస్తోంది.

### అభివృద్ధి నిధుల వ్యత్యాసం

స్మార్ట్ సిటీ పథకాల కింద వచ్చే నిధుల వినియోగంలో కూడా హన్మకొండదే పెత్తనం అని విమర్శలు ఉన్నాయి. హన్మకొండలో రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, పార్కులు వేగంగా అభివృద్ధి చెందాయి. వరంగల్ తూర్పు ప్రాంతంలో ఇరుకైన రోడ్లు, డ్రైనేజీ సమస్యలు దశాబ్దాలుగా అలాగే ఉన్నాయి. చారిత్రక ఖిలా వరంగల్ ప్రాంతం పర్యాటక కేంద్రంగా ఎదగడానికి కావాల్సిన స్థాయిలో నిధులు మళ్లడం లేదనేది స్థానిక రాజకీయ నాయకుల వాదన.

## లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు తెలంగాణ అగ్రగామి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

### బయోఏషియా వేదికగా ప్రపంచ దిగ్గజాలతో సీఎం భేటీ

లైఫ్ సైన్సెస్ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూల గమ్యస్థానంగా మారిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చారు. బయోఏషియా-2026 సదస్సు సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. జీవవైజ్ఞానిక రంగంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు అనుగుణంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక జోన్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. రాష్ట్రంలో విధాన స్థిరత్వం, ఆధునిక మౌలిక వసతులు, నైపుణ్య వనరులు ఉన్నాయని పెట్టుబడిదారులకు వివరించారు. సమావేశంలో పలు కీలక పెట్టుబడి ఒప్పందాలు కుదిరాయి. ఒపెలా హెల్త్‌కేర్ సంస్థ హైదరాబాద్‌లో 42 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను విస్తరించి, వచ్చే ఏడాదిలోపు 500 ఉద్యోగాలను కల్పించనుంది. ఇండొనేషియాకు చెందిన జేపీఎఫ్ఏ సమూహంలోని వాక్సిండో ఎనిమల్ హెల్త్‌కేర్ విభాగం జీనోమ్ వ్యాలీలో ఆధునిక వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అలాగే ట్రిడెన్స్ సంస్థ కృత్రిమ మేధ ఆధారిత ఆరోగ్య సేవల కోసం హైదరాబాద్‌లో 18 వేల చదరపు అడుగుల ఇన్నోవేషన్ హబ్‌ను నెలకొల్పనుంది. ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ సంస్థ జీనోమ్ వ్యాలీలో సుమారు 12 ఎకరాల్లో ఆధునిక పరిశోధనా కేంద్రాన్ని నిర్మించి, వచ్చే ఆరేళ్లలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ సమావేశంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. తెలంగాణను ప్రపంచ లైఫ్ సైన్సెస్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పునరుద్ఘాటించారు.

## కాంగ్రెస్ గూండాల దాడి ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు పార్టీ నాయకులపై జరిగిన రాళ్ల దాడిని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ గుండాల దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకున్నప్పటికీ, చైర్మన్ ఎన్నికల్లో కౌన్సిలర్లు పాల్గొనకుండా అడ్డుకొని వాయిదా వేయడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. కొంతమంది పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, అన్యాయాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపైనే లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు. న్యాయం కోసం నిరసన తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌లపై కేసులు నమోదు చేస్తామని బెదిరించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని అన్నారు. జనగామలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ చేయి ఎత్తిన దళిత మహిళా కౌన్సిలర్ పట్ల కాంగ్రెస్ కౌన్సిలర్లు అసభ్యంగా ప్రవర్తించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలో అధికార కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అరాచక పాలన సాగిస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. ఈ విధానాలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## జనగామలో లక్కీ డ్రాతో కాంగ్రెస్ విజయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణలో వాయిదాపడిన పలు మున్సిపాలిటీల్లో ఈరోజు చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మొత్తం పదెనిమిది వార్డుల్లో బీఆర్ఎస్ తొమ్మిది, కాంగ్రెస్ నాలుగు, భారతీయ జనతా పార్టీ రెండు, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానం గెలుచుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో బీఆర్ఎస్ ఆధిక్యం సాధించింది. ఇంద్రేశం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమీల, వైస్ చైర్మన్‌గా హరీశ్ రెడ్డి ఎన్నికయ్యారు. పఠాన్‌చెరు పరిధిలోని గడ్డపోతారం, గుమ్మడిదల, జిన్నారం, ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలను బీఆర్ఎస్ దక్కించుకుంది. స్థానిక స్థాయిలో బీఆర్ఎస్ బలాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. జనగామ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సమానంగా పదహారు ఓట్లు రావడంతో లక్కీ డ్రా నిర్వహించారు. అదృష్టం కాంగ్రెస్ పార్టీని వరించింది. ఛైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి బాలమణి ఎన్నికయ్యారు. జనగామలో ముప్పై వార్డులకు గాను బీఆర్ఎస్ పదమూడు, కాంగ్రెస్ పన్నెండు, ఇతరులు ఐదు స్థానాలు గెలుచుకున్నారు. ఎక్స్‌ఆఫీషియో సభ్యులతో కలిపి మెజారిటీ సంఖ్య పదిహేడు కాగా, రెండు పార్టీలకు పదహారు మంది సభ్యుల చొప్పున మద్దతు లభించడంతో ఉత్కంఠ నెలకొంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ దక్కించుకోగా, టేకు సుదర్శన్ రెడ్డి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇల్లెందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుని దొడ్డ కిరణ్ మిత్రను ఛైర్మన్‌గా ఎన్నుకుంది.

## మోసానికి మారుపేరు కాంగ్రెస్

- ఇచ్చిన హామీలు అమలు కాలేదు
- బడ్జెట్‌లో నిధుల కేటాయించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇరవై ఆరు నెలలు పూర్తయ్యినా మహిళలు, విద్యార్థినులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. మోసానికి మారుపేరు కాంగ్రెస్ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో మహిళలకు ప్రతి నెల రెండు వేల ఐదు వందల రూపాయలు, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, నాలుగు వేల రూపాయల పింఛన్ పెంపు వంటి వాగ్దానాలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత తెలిపారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం సరికాదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో మహిళలకు రెండు వేల ఐదు వందల రూపాయల ఆర్థిక సహాయం, విద్యార్థినులకు స్కూటీలు, నాలుగు వేల రూపాయల పింఛన్ పెంపుకు తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని హెచ్చరించారు.

## ఐబొమ్మ రవికి బెయిల్ మంజూరు

- ప్రతిరోజూ సీసీఎస్ ఎదుట హాజరు కావాలని ఆదేశం
- పాస్‌పోర్టు సమర్పణ, ఇంటర్నెట్ వినియోగంపై పరిమితులు
- షరతులతో కూడిన నిర్ణయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఐబొమ్మ రవికి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో పలు కఠిన నిబంధనలు విధిస్తూ ఈ నిర్ణయం వెలువడింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఆయన ప్రతిరోజూ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ కార్యాలయం ఎదుట హాజరుకావాలి. దర్యాప్తుకు పూర్తి సహకారం అందించాలని స్పష్టం చేసింది. కేసు పురోగతిపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించనున్నారు. అదనంగా తన పాస్‌పోర్టును పోలీసులకు సమర్పించాలని, దేశం విడిచి వెళ్లరాదని కోర్టు షరతు విధించింది. విచారణ పూర్తయ్యే వరకు విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని పేర్కొంది. ఇంటర్నెట్ వినియోగంపై కూడా పరిమితులు విధించబడినట్లు సమాచారం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పోలీసుల అనుమతితో వినియోగించాలనే నిబంధన పెట్టింది. కోర్టు విధించిన షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేసే అవకాశం ఉందని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి.

వేద న్యూస్
బుధవారం ఫిబ్రవరి 18, 2026

# నిర్లక్ష్యపు 'యమపాశం'!

- ఇందిరమ్మ ఇంటికి శాపం
- కరెంట్ తీగ తొలగించాలంటున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు



**వేద న్యూస్, కారేపల్లి:**

ఒకవైపు గూడు లేని పేదవారికి 'ఇందిరమ్మ ఇల్లు' నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం ఆ కలను కల్లలుగా మార్చుతోంది. కారేపల్లి మండలం గాదేపాడు గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ఒక నిరుపేద కుటుంబం తమ సొంత ఇంటి కల నెరవేరక ఆవేదన చెందుతోంది. గాదేపాడు గ్రామానికి చెందిన భూక్యా సుప్రజ-గోవర్ధన్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. తమ సొంత గూడు కట్టుకోవాలని ఆశించిన వారికి నిర్మాణ స్థలం మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలు అడ్డంకిగా మారాయి. ఆ వైర్ల కారణంగా ఇంటి నిర్మాణ పనులు ముందుకు సాగకుండా నిలిచిపోయాయి.

**కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..**

ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గోవర్ధన్ గత కొంతకాలంగా విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, అధికారుల నుంచి స్పందన లభించలేదు. గత ఏడాది జరిగిన ప్రమాదంలో గాయపడినప్పటికీ, తన శారీరక ఇబ్బందులను లెక్కచేయకుండా అధికారులను వేడుకుంటున్నా ప్రయోజనం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే 'వేద న్యూస్' ద్వారా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**మాకు న్యాయం ఎక్కడ?.. లబ్ధిదారుడి ఆవేదన**

'మా లాంటి సామాన్య ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుంది? ఆఫీసుల చుట్టూ తిరగలేక, ఇల్లు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే మా ఇంటి నిర్మాణం ఆగిపోయింది. అధికారులు స్పందించి ఆ తీగలను తొలగించి మా ఇంటి కలను నెరవేర్చాలి...' అని లబ్ధిదారులు భూక్యా సుప్రజ-గోవర్ధన్ దంపతులు వేడుకున్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలన అవసరం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదల ఇళ్ల నిర్మాణానికి ఉన్న అడ్డంకులను ప్రాధాన్యత క్రమంలో తొలగించాల్సి ఉంది. అయితే గాదేపాడు గ్రామంలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే విద్యుత్ లైన్లను మార్చి సుప్రజ-గోవర్ధన్ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు




**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ నాయకులు, కార్య కర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల ఇంచార్జ్ గాండ్ల మధు మాట్లాడుతూ, తెలంగాణ సాధన అనంతరం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దౌర్ సాయిలు, శేఖర్, ప్రవీణ్ కుమార్, గజేందర్, నరేందర్, వెంకటేష్, వినీత్ పటేల్, శ్రావణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

**- ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్**



**వేద న్యూస్, కారేపల్లి:**

వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కారేపల్లి గ్రామపంచాయతీ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. మండల కేంద్రంలోని ప్రధాన తాగునీటి బావి మోటార్ దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి మంగళవారం మరమ్మతు పనులను పూర్తి చేశారు. మండల పరిషత్ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ స్వయంగా పనులను పర్యవేక్షించి, మోటార్‌ను త్వరితగతిన మరమ్మతు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నెహ్రూ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు నిరంతరం తాగునీరు అందించడమే లక్ష్యమని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తామని ఎంపీవో రవీంద్ర ప్రసాద్ తెలిపారు. అధికారులు చూపిన చొరవ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# హిందీ పండిట్ సత్యనారాయణ కన్నుమూత

**- కారేపల్లి మండలంలో విషాదఛాయలు**

**వేద న్యూస్, కారేపల్లి:**

వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తన బోధనతో తీర్చిదిద్దిన హిందీ పండిట్ సత్యనారాయణ (55) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలిసి కారేపల్లి మండలంతో పాటు ఆయన సేవలందించిన ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. సత్యనారాయణ గ్రేడ్-2 హిందీ పండిట్‌గా విద్యాశాఖలో సేవలందిస్తూ తనదైన ముద్ర వేశారు. 2001 నుండి 2006 వరకు విశ్వనాథపల్లిలో పనిచేసి, హిందీ భాషను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించి మంచి పేరు సంపాదించారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొమ్రారం ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యం బాధిస్తున్నప్పటికీ, చివరి వరకు విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేశారు. క్రమశిక్షణ, నిరాడంబరతకు మారుపేరుగా నిలిచిన సత్యనారాయణ, విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను కూడా బోధించారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు, సహచర ఉపాధ్యాయులకు, పూర్వ విద్యార్థులకు తీరని లోటుగా మారింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



# తిప్పాపూర్ గ్రామ శివారులో పెద్దపులి కలకలం

**- మూడు ఆవులు, ఒక దూడ మృతి**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామ శివారులో పెద్దపులి సంచారం కలకలం రేపింది. సోమవారం రాత్రి రైతులకు చెందిన మూడు ఆవులు, ఒక ఆవు దూడపై పులి దాడి చేసి హతమార్చిన ఘటన స్థానికంగా భయాందోళనలకు గురి చేసింది. తిప్పాపూర్-పెద్దలింగాపూర్ రోడ్డులోని కల్వర్టు సమీప గుట్టలను ఆనుకుని ఉన్న పొలాల వద్ద కట్టేసి ఉన్న పశువులపై ఈ దాడి జరిగినట్లు సమాచారం. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల మల్లయ్యకు చెందిన మూడు ఆవులు, వోరెం సుధాకర్‌కు చెందిన ఒక ఆవు దూడ మృతి చెందాయి. మంగళవారం ఉదయం రైతులు పొలాలకు వెళ్లి చూడగా, పశువులు మెడలపై తీవ్ర గాయాలతో మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ పులి పాదముద్రలు స్పష్టంగా కనిపించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల సిద్దిపేట జిల్లా కోహెడ మండలం, చిన్నకోడూర్ మండలం విఠలాపూర్, కిష్టాపూర్ ప్రాంతాల్లో పులి సంచారం గుర్తించిన నేపథ్యంలో, ఇదే పులి ఇక్కడికి చేరి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనతో తిప్పాపూర్, పెద్దలింగాపూర్ మరియు పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు. ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# తండ్రి చేతిలో కుమారుడి దారుణ హత్య

- మద్యం తాగి వేధిస్తున్నాడని ఘాతుకం
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు



**వేద న్యూస్, మానకొండూర్:**

కరీంనగర్ జిల్లా మానకొండూరులో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కన్న తండ్రే తన కుమారుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. అనంతరం నిందితుడు స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోవడం సంచలనంగా మారింది. మంగళవారం ఉదయం పూరం కనకయ్య అనే వ్యక్తి మరో వ్యక్తితో కలిసి మానకొండూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తన కుమారుడు పూరం శ్రీనివాస్ (35)ను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు వెంటనే అతనితో పాటు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా, శ్రీనివాస్ తలపై తీవ్ర గాయాలతో మృతదేహంగా కనిపించాడు. పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసిన వివరాల ప్రకారం, శ్రీనివాస్‌కు వివాహం కాలేదు. తండ్రి, కొడుకులు ఒకే గదిలో నివసిస్తుండగా, మరో కుమారుడు మరియు కోడలు పక్క గదిలో ఉంటున్నారు. శ్రీనివాస్ తరచూ మద్యం సేవించి వచ్చి తండ్రితో గొడవపడుతుండేవాడని, దీంతో ఇంట్లో తరచూ వివాదాలు జరుగుతుండేవని సమాచారం. సోమవారం రాత్రి కూడా మద్యం సేవించి వచ్చి తండ్రితో వాగ్వాదానికి దిగిన అనంతరం, రాత్రి నిద్రలో ఉన్న సమయంలో ఇంటి పక్కనే ఉన్న బండరాయితో తలపై బలంగా కొట్టడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

- ఇన్ చార్జ్ కలెక్టర్ గరిమ అగర్వాల్
- ఏకలవ్య మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన




**వేద న్యూస్, కోనరావుపేట:**

కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి సీబీఎస్ఈ మ్యాథ్స్ పరీక్షలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. లైబ్రరీ, స్కిల్ ఇండి యా కార్యక్రమంలో భాగంగా నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిటైల్ ల్యాబ్‌ను పరిశీలించి, అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం 9వ తరగతి గదిని సందర్శించి, పాఠ్యాంశాల పురోగతి, వార్షిక పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. విద్యాలయంలో మధ్యాహ్న భోజనం తయారీని కూడా పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం ఆహారం సిద్ధం చేస్తున్నారా అని తనిఖీ చేశారు. కోడిగుడ్లు, బియ్యం, కూరగాయలు, పప్పులు తదితర పదార్థాల నాణ్యత, గడువు తేదీలను పరిశీలించి, కిచెన్ మరియు స్టోర్‌రూం నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ రామ్ సూరత్ యాదవ్, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, పీఆర్, హౌసింగ్ ఏఈ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల కేంద్రంలో కోతుల దాడిలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. మండల కేంద్రానికి చెందిన పులి మల్లికాంబ ఇంట్లోకి కోతులు చొరబడడంతో, భయంతో ఆమె కిందపడిపోయి చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన మల్లికాంబను కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక వైద్యుల వద్దకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో కోతుల సంచారం పెరగడంతో పలువురు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. కోతులు ఇళ్లలోకి చొరబడి గోనెపెంకలు, పర్దాలు చింపేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నాయని వాపోతున్నారు. కోతుల భయంతో గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, పరిస్థితి రోజురోజుకూ తీవ్రమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 18, 2026

## పీసీసీ అధ్యక్షుడికి బీసీ జేఏసీ నేతల కృతజ్ఞతలు



**వేద న్యూస్, దామరచర్ల:**

రాష్ట్రవ్యాప్తంగా జనరల్ స్థానాల్లో బీసీలకు మున్సిపల్ చైర్మన్ పదవులు కల్పించినందుకు బీసీ జేఏసీ నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మంగళవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జనరల్ స్థానాల్లో కౌన్సిలర్‌లు, మున్సిపల్ చైర్మన్ పదవులకు బీసీలకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించడం శుభ పరిణామమన్నారు. బలహీన వర్గాలకు చెందిన నాయకుడు మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండటం వల్లే బీసీలకు ఈ స్థాయిలో ప్రాధాన్యం లభించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపల్ చైర్మన్ పదవుల్లో 64 మంది బీసీలు గెలిచి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ చైర్మన్‌గా బీసీలకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరగా, మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు, బీసీ విద్యార్థి సంఘం ప్రతినిధులు మరియు ఇతర నేతలు పాల్గొన్నారు.

## వెళ్లొస్తాం రాజన్న..చల్లగా చూడు భీమన్న..

**- వేములవాడలో ముగిసిన మహాశివరాత్రి సంబరాలు**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, 'వెళ్లొస్తాం రాజన్న.. మళ్లీ ఏడాది మొక్కులు తీర్చుకుంటాం' అంటూ భక్తి భావంతో తమ స్వస్థలాలకు పయనమయ్యారు. జాతర సందర్భంగా వేములవాడ పురవీధులు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. రాత్రంతా భక్తులు శివనామస్మరణతో జాగరణ చేస్తూ, భజనలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించారు. అనుబంధ దేవాలయమైన భీమేశ్వర స్వామిని కూడా వేలాది మంది దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర నిర్వహణను జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ పర్యవేక్షణలో అధికారులు పకడ్బందీగా చేపట్టారు. దాదాపు 5000 మంది వివిధ శాఖల సిబ్బంది సేవలందించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక బస్ స్టాండ్ ఏర్పాటు చేయడంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. ఎస్పీ మహేష్ వి. గీతే ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు



ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచారు. భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ వంటి సౌకర్యాలు కల్పించి, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు కోడె మొక్కులు మరియు ఇతర మొక్కులను తీర్చుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి ఆనందంగా తిరుగు ప్రయాణం అయ్యారు. మహాశివరాత్రి జాతర విజయవంతంగా ముగియడంతో అధికారులు, ఆలయ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారు.

## 'రంగనాయకసాగర్' కెనాల్ నిర్మాణంలో జాప్యం

**- రైతుల ఆందోళన**

**- మద్దతు తెలిపిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వేణు**

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో రంగనాయకసాగర్ ఎల్‌ఎం-6 కెనాల్ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళన ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ ఆందోళనకు జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనాల్ నిర్మాణంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో సుమారు 12 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, అయితే మిగిలిన పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఎన్నికల సమయంలో మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చినా, ఇప్పటివరకు అమలు కాలేదని ఆరోపించారు. ఈ కెనాల్ పనులు పూర్తయితే పెద్ద




లింగాపూర్, దాచారం, రామోజిపేట, వెల్జీపూర్ తదితర గ్రామాలకు సాగునీరు అందడంతో పాటు సుమారు 10 వేల ఎకరాలు సాగులోకి వస్తాయని తెలిపారు. ప్రస్తుతం పనులు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి, తాత్కాలిక పంపింగ్ సిస్టం ఏర్పాటు చేసి పంటలను రక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన కొనసాగుతుందని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో ఈ నెల 18న సూర్యాపేట లయన్స్ క్లబ్ ఆఫ్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ చైర్మన్ మిర్యాల సుధాకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు కూడా చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఆధార్ కార్డు వెంట తీసుకుని వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మిర్యాల సుధాకర్ సూచించారు.



## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**- కేక్ కటింగ్.. ఉపాధి కూలీలకు పండ్ల పంపిణీ**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను నల్లబెల్లి మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకుడని కొనియాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రైతు బంధు, రైతు బీమా, మిషన్ భగీరథ వంటి పథకాల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. ఈ సందర్భంగా నల్లబెల్లి బస్టాండ్ వద్ద బాణాసంచా పేల్చి కేక్ కట్ చేశారు. అనంతరం పెద్ద చెరువు సమీపంలో జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



**- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల సుమంత్**

**వేద న్యూస్, గంగాధర:**

రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్, గురుకుల మరియు మైనారిటీ విద్యాసంస్థల్లో అందిస్తున్న ఉచిత విద్య అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల సుమంత్ సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, పుస్తకాలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఈ విద్యాసంస్థలు ఎంతో ఉపయోగకరమని, ఇప్పటికే ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోందని, మోడల్ స్కూల్స్ మరియు మైనారిటీ విద్యాసంస్థలకు ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు సమయంలో ఫోటో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం వంటి అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకుని సమీప మీ సేవ కేంద్రం లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత గల ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని తాళ్ల సుమంత్ కోరారు.

## రైతులకు అందుబాటులో యూరియా

**- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్**




**వేద న్యూస్, దామరచర్ల:**

పోడు, అసైన్డ్ భూములను సాగు చేస్తున్న రైతులు కూడా యూరియా పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ తెలిపారు. మంగళవారం దామరచర్ల రైతు వేదికలో రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోడు మరియు అసైన్డ్ భూములను సాగు చేస్తున్న రైతులు సంబంధిత భూముల 13బీ/వన్‌బీ జిరాక్స్ కాపీలు, ఆధార్ వివరాలతో గ్రామ పరిపాలన అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియాను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సైదా నాయక్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో ఆదేశాలు బేఖాతరు

**- జూనియర్ అసిస్టెంట్‌పై ఆరోపణలు**

**- సర్టిఫికెట్ కోసం వచ్చిన యువకుడితో వాగ్వాదం**




**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన బూరుగుపల్లి గ్రామానికి చెందిన యువకుడు కార్యాలయానికి వెళ్లగా, విధుల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌తో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. దరఖాస్తు ఫామ్ ఇవ్వాలని కోరిన యువకుడితో జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ అనుచితంగా ప్రవర్తించినట్లు బాధితుడు ఆరోపించాడు. చిన్న విషయాన్ని పెద్ద వివాదంగా మార్చి, అర్జీదారునిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇదే విధంగా గతంలో కూడా ప్రజలతో వివాదాస్పదంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సేవలు అందించాల్సిన సిబ్బంది ఈ విధంగా ప్రవర్తించడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కేసీఆర్ జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, అనంతరం సర్పంచ్ అనుముల భాస్కర్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు పటాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర విశేషమని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 18, 2026

# కేసీఆర్ జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

- అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం విజ్ఞప్తి



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రహదారులకు ఆనుకుని వ్యవసాయ బావులు ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల పక్కనే ఉన్న ఈ బావులు రాత్రి సమయంలో మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, అధికారులు సంబంధిత రైతులతో సమావేశాలు నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సీపీఎం మండల నాయకులు కోరారు. రహదారులకు ఆనుకుని ఉన్న బావులను గుర్తించి, అవసరమైతే రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించి పూడ్చివేయాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించి, ప్రమాదకరంగా ఉన్న బావులను తొలగించే చర్యలు చేపట్టాలని సీపీఎం పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# వైటీపీఎస్ స్టేజ్-2 ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**వేద న్యూస్, దామరచర్ల:**

దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-2 ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. నూతన రీజినల్ ప్రెసిడెంట్‌గా చిలుముల శివ, రీజినల్ సెక్రటరీగా దారా ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు జెన్కో కంపెనీ ప్రెసిడెంట్ మేకల నాగరాజు, జనరల్ సెక్రటరీ శ్రీహరి సూచనల మేరకు, కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పారపు రమేష్, వైస్ ప్రెసిడెంట్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం (కేవీ)లో జరుగుతున్న సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మ్యాథ్స్ పరీక్ష నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శేషా ప్రసాద్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన



**వేద న్యూస్, కోనరావుపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్ల, నిమ్మపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఇంచార్జి కలెక్టర్

- లబ్ధిదారులు నిర్మాణ పనుల ప్రారంభించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్

గరిమ అగర్వాల్ మంగళవారం పరిశీలించారు. మండలానికి మొత్తం 577 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 460 ఇండ్లకు ముగ్గు పోయినట్లు, 401 ఇండ్లు బేస్‌మెంట్ స్థాయిలో, 325 ఇండ్లు గోడల స్థాయిలో, 287 ఇండ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నట్లు హౌసింగ్ అధికారులు వివరించారు. ముగ్గు పోసిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి, ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇటుకలు, నిర్మాణ సామగ్రి సరైన ధరలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మేస్త్రీలు, కార్మికులతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, హౌసింగ్ ఏఈ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, శాయంపేట**

మాజీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 72వ జన్మదిన వేడుకలను శాయంపేట మండలంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మారపల్లి మోహన్, ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వంట మనుషులతో బాత్‌రూమ్‌లు కడిగించడం అమానుషం

- సీఐటీయూ ఆగ్రహం
- కలెక్టర్ కు వినతిపత్రం సమర్పణ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మోడల్ స్కూల్ హాస్టళ్లలో వంట మనుషులు, వాచ్‌మెన్‌లతో బాత్‌రూమ్‌లు శుభ్రం చేయించాలని ఆదేశించడం అమానుషమని సీఐటీయూ ఆధ్వర్యంలోని మోడల్ స్కూల్ హాస్టల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు యూనియన్ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, గతంలో హాస్టళ్లలో పనిచేసిన స్కావెంజర్లను తొలగించి, ఆ పనులను వంట మనుషులు, వాచ్‌మెన్‌లతో చేయించడం సరికాదన్నారు. ఆహారం తయారు చేసే సిబ్బందితో బాత్‌రూమ్‌లు శుభ్రం చేయించడం అనారోగ్యకరమని, ఇది కార్మికుల పట్ల అన్యాయం అని పేర్కొన్నారు. ప్రతి హాస్టల్‌కు స్కావెంజర్లను నియమిస్తామని విద్యాశాఖ అధికారులు గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, అదనంగా శుభ్రత పనుల కోసం సిబ్బందిని నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మరియు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# నేతాజీపై వ్యాసరచన పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరెం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల కోసం 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ హాజరై మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన మహానేత అని కొనియాడారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో నేతాజీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బోయిని వేణు యాదవ్, వాలంటీర్లు మరియు ఇతరులు పాల్గొన్నారు.


# సిరిసిల్ల జిల్లా వాసులకు అలర్ట్..

- మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరా మూడు రోజుల పాటు నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ మొహమ్మద్ ముజాహిద్ అన్వర్ తెలిపారు. జిల్లాలోని 120 ఎంఎల్డీ సామర్థ్యం గల నీటి శుద్ధి కేంద్రంలో ఆపరేషన్, మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో 20వ తేదీ నుంచి 22 వరకు ప్లాంట్‌ను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. దీనివల్ల సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిపోనుంది. 23వ తేదీ నుంచి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. అప్పటివరకు ప్రజలు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# మెట్టు రామలింగేశ్వరుడికి మహాపూర్ణాహుతి, త్రిశూల స్నానం



**వేద న్యూస్, మడికొండ:**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళ వారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గవ్యాంత పూజలు, నవగ్రహ రుద్ర సహిత చండీ హోమం, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, చూర్ణోత్సవం, అవభృథం, త్రిశూల స్నానం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్నపూజ, మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి అండగా..



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట గ్రామానికి చెందిన మెరగుత్తి కిరణ్ అనారోగ్యంతో మృతి చెందగా, ఆయనతో కలిసి 2001 - 2002 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 25వేలు నగదును కిరణ్ భార్య, పిల్లలకు అందజేశారు. కిరణ్ అకాల మరణం పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయనతో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు, స్నేహితులు పాల్గొని కుటుంబానికి ధైర్యం చెప్పారు.

# మడికొండలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

## – మెట్టుగుట్ట రామలింగేశ్వర స్వామి సన్నిధిలో అరూరి రమేష్ ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, మడికొండ:**

కేసీఆర్ జన్మదిన వేడుకలను మడికొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మెట్టుగుట్ట శ్రీ స్వయంభు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవలు చేయాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించి, సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దార్శనిక నాయకుడని అరూరి రమేష్ కొనియాడారు. అనంతరం మడికొండ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**వేద న్యూస్, వేములవాడ రూరల్:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేముల వాడ రూరల్ మండలం హనుమాజీపేట వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ కులు తీవ్రంగా గాయ పడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, హనుమాజీపేటకు చెందిన తీపిరెడ్డి అశోక్ రెడ్డి తన ద్విచక్ర వాహనంపై గ్రామం వైపు వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన నాంపల్లి నితిన్ వెనుక నుండి బైకుతో బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ జంకె మధు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కేసీఆర్ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం లో మాజీ ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర రావు జన్మది న వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ ఎస్ పార్టీ నాయ కుల ఆధ్వర్యం లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి, పటాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు కేసీఆర్ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎంపీఎఫ్ సేవలను వేగవంతం చేస్తున్నాం

## – పెన్షన్, సీఎంపీఎఫ్ క్లెయిమ్స్‌కు జీరో పెండింగ్ లక్ష్యం
## – రీజినల్ కమిషనర్ హరి పచౌరి

**వేద న్యూస్, మందమర్రి:**

పదవీ విరమణ పొందిన కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు సీఎంపీఎఫ్ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) సేవలను వేగవంతం చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 హరి పచౌరి తెలిపారు. మంగళవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్ పెన్షన్‌కు సంబంధించిన లావాదేవీలను సీకేర్ పోర్టల్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, కొత్త క్లెయిమ్స్ త్వరగా పరిష్కరించేందుకు 'ప్రయాస్' విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పెన్షన్, సీఎంపీఎఫ్ క్లెయిమ్స్‌ను జీరో పెండింగ్ లక్ష్యంగా త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 118 రివైజ్డ్



పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలను సంబంధిత అధికారులకు అందజేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను సీ-కేర్ పోర్టల్ ద్వారా పరిష్కరించి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మరియు సీఎంపీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫెయిర్‌వెల్ పార్టీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ఆనందో త్సాహాల మధ్య జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఎం. రాజు మాట్లాడుతూ, ఇంటర్ పూర్తి చేస్తున్న విద్యార్థులకు ఇది జీవితంలో ముఖ్యమైన మలుపు అని తెలిపారు. కళాశాల జీవితం క్రమశిక్షణ, విలువలు, బాధ్యతలను నేర్పుతుందని, ఇక్కడ నేర్చుకున్న పాఠాలు భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించగలరని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ శరత్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్యసాధకుడు కేసీఆర్

## – బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచి
## – మిర్యాలగూడలో ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు
## – ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



**వేద న్యూస్, నల్గొండ ప్రత్యేక ప్రతినిధి:**

కల్వకుంట్ల చంద్రశేఖర రావు కార్యసాధకుడు అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అభివర్ణించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన కృషి చారిత్రాత్మకమని కొనియాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ప్రకటించని హామీలను కూడా నెరవేర్చిన మహానేత కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం శెట్టిపాలెం, వేములపల్లి గ్రామాల్లో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో భాస్కర్ రావు పాల్గొని మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. వారిని ఈ సందర్భంగా అభినందించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని భాస్కర్ రావు తెలిపారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్రానికే కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. తెలంగాణ మాదిరిగా దేశం అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ వంటి దార్శనిక నాయకత్వం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహా రెడ్డి, జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ, అన్నభీమోజు నాగార్జున చారి, యడవల్లి శ్రీనివాస్ రెడ్డి, షోయబ్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన మేయర్‌కు బీజేపీ నాయకుల సన్మానం

**వేద న్యూస్, శంకరపట్నం:**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్‌ను శంకరపట్నం మండల బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. తీగల గుంటపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్‌గా ఎన్నికైన ఆయన ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భీమన్న సన్నిధిలో భక్తుల జాతర

## – మూడు రోజుల్లో 2.59 లక్షల మందికి పైగా దర్శనం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవ స్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయానికి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో జరిగిన మూడు రోజుల జాతరలో మొత్తం 2,59,598 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో శివనామస్మరణతో భక్తి వాతావరణం నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చినప్పటికీ, పకడ్బందీ ఏర్పాట్లతో దర్శనాలు సాఫీగా కొనసాగినట్లు అధికారులు వెల్లడించారు.

# మార్నింగ్ వాక్‌లో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన

## – వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్

**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం కాలనీల్లో మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కాలువలను పరిశీలించి, చెత్తాచెదారం వేయవద్దని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. డ్రైనేజీలు మూసుకుపోతే దుర్వాసనతో పాటు అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే వేసవికాలం దృష్ట్యా మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాత బోరింగులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న సర్పంచ్ పబ్బు సతీష్ చర్యలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.



# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, చొప్పదండి:**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను చొప్పదండి పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తిని సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహానేత అని కొనియాడారు. ఆయన ప్రవేశ ెట్టిన సంక్షేమ పథకాలు తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలిపాయని పేర్కొన్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజల కు సేవలు చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోడిచన్ పల్లి తండాలో ఉచిత వైద్య శిబిరం

**వేద న్యూస్, పాపన్నపేట :**




పొద్చన్ పల్లి తాండలో మల్లారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డయాబెటిస్, రక్తపోటు, థైరాయిడ్, దీర్ఘకాల సమస్యలు, మోకాళ్ళనొప్పులు, అస్తమా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు మల్లారెడ్డి హాస్పిటల్ నందు వైద్యసేవలు అందుబాటులో ఉన్నట్టు ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బుజ్జి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు పాలత్య, రవి, బిక్య, శ్రీను, లాల్ సింగ్, మనోజ్, మురళి తదితరులు ఉన్నారు.

# బండెనక బండి కట్టి..దుర్గమ్మ పేరు తలచి

- వైభవంగా ఏడుపాయల జాతర ఉత్సవాలు
- అమ్మవారికి ఘనంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు
- భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు ఏడుపాయల
- బండ్లు, బోనాలు ఇక్కడి ప్రత్యేకత
- నేడు రథోత్సవం



**వేద న్యూస్, పాపన్నపేట :**

జనమేజయుడు సర్పయాగం చేసిన స్థలం, మంజీరా నది ఏడుపాయలుగా చీలిన చోట వెలసిన వనదుర్గా మాత దేవాలయం ఏడుపాయల వద్ద మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రంగురంగుల కాంతులతో ప్రకాశిస్తున్న దేవస్థానం పరిసరాలు దుర్గమ్మ నామ స్మరణతో మారుమ్రోగాయి. భక్తి, సంప్రదాయం సంస్కృతిల సమ్మేళనం ఏడుపాయల జాతర. రెండవ రోజు అయిన సోమవారం దుర్గామాతకు ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పాపన్నపేట నుంచి రాణి శంకరమ్మ సంస్థానాధీశుల తరపున మొదటి బండి, అనంతరం నాగసాన్ పల్లి, శేరిపల్లి, అన్నారం, అబ్లాపూర్, ఎల్లాపూర్ సహా పలు గ్రామాల నుంచి ఎడ్ల బండ్లు ఊరేగింపులో పాల్గొన్నాయి. యువత కేరింతల నడుమ ఊరేగింపు జరగ్గా ఆలయ పరిసరాలు దుర్గమ్మ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. జాతర మహోత్సవాలకు లక్షలాదిగా భక్తులు రావడంతో వనమంతా జనంతో నిండిపోయింది. ఒక్క తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల మధ్య బోనమెత్తి చేసిన నృత్యాల కోలాహలంతో భక్తులు పులకించిపోయారు. బండ్ల ఊరేగింపు, బోనాల సమర్పణ ఇక్కడి ప్రత్యేకత. భక్తులు అనేక సంఖ్యలో మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో ఉన్న సంతాన గుండంలో దంపతులు స్నానమాచరిస్తే సంతానం కలుగుతుందని ఆనాదిగా వస్తున్న విశ్వాసంతో నూతన దంపతులు సంతాన గుండంలో స్నానమాచరించారు. శివరాత్రి రోజు భక్తుల సంఖ్య తక్కువగా కనిపించినా సోమవారం భక్తుల సంఖ్య మరింత పెరిగింది. మంగళవారం రథోత్సవంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయి. దేవాదాయ, పంచాయతీరాజ్, పోలీసు శాఖతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్య శాఖ , ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది ఇక్కడ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నిరంతరాయంగా నడిపిస్తోంది. శాంతిభద్రతలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాతో పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, ఈఓ వీరేశం లు ఎప్పటికప్పుడు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# రంజాన్ మాసంలో 24 గంటల పర్మిషన్ ఇవ్వండి

- సీపీకి వినతి పత్రం అందజేత



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

నేటి నుంచి ప్రారంభం కానున్న రంజాన్ నెల ఉపవాసాల సందర్భంగా వరంగల్ మండి బజార్ మర్చంట్ అసోసియేషన్ వారిని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు అయూబ్ తో కలిసి వరంగల్ సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి సంవత్సరం లాగే పవిత్రమైన రంజాన్ మాసంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గతంలోగా ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ ఉపవాసాల నెల జరుపుకునే విధంగా ప్రభుత్వము పోలీస్ యంత్రాంగము మున్సిపాలిటీ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. మరి ముఖ్యంగా రంజాన్ మాసంలో 24 గంటల పర్మిషన్ ఇవ్వాల్సిందిగా వరంగల్ సిపి సంప్రీత్ ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్, మర్చంట్ అసోసియేషన్ వారు కలసి మర్యాదపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. సీపీని కలిసిన వారిలో మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు రహీం, ప్రధాన కార్యదర్శి రఘురాం, క్యాషియర్ ఎజాజ్, కొయ్యడ ప్రభాకర్, కమల్, పాషా, మరియు మర్చంట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో వైఎస్ షర్మిల



- మన్రేగా పునరుద్ధరణకు గట్టిగా డిమాండ్
- గార్లేయపురం సభకు ప్రజల విశేష స్పందన
- పేదల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం

**వేద న్యూస్ అమరావతి:**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్రలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పాల్గొన్నారు. కోడుమూరు నియోజకవర్గంలోని గార్గేయపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. సభకు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మన్రేగా చట్టాన్ని బలహీనపరిచే విధానాలను వ్యతిరేకిస్తూ, పేద ప్రజల ఉపాధి అవకాశాలను దెబ్బతీసే చర్యలను తక్షణమే నిలిపివేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి, మన్రేగా చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం వేలాది కుటుంబాలకు జీవనాధారమని, దానిని బలపరచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. పేదల పొట్టగొట్టే విధానాలను కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని హెచ్చరించారు. ఈ సభకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు కొప్పుల రాజు కూడా హాజరయ్యారు. ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం పార్టీ పోరాటం కొనసాగుతుందని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

# శాసనమండలిలో రభసపై జనసేన ఆగ్రహం

**వేద న్యూస్ అమరావతి:**



శాసనమండలిలో కావాలనే రభస సృష్టించి ప్రజా సమస్యలు, రాష్ట్ర బడ్జెట్‌పై చర్చను పక్కదోవ పట్టిస్తున్నారని జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, నిమ్మక జయకృష్ణ వైసీపీపై మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడిన వారు, విలువైన సభా సమయాన్ని వృథా చేయడం దురుద్దేశపూర్వక చర్య అని ఆరోపించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన రాష్ట్ర బడ్జెట్‌పై చర్చించాల్సిన విపక్ష పార్టీ శాసనమండలిలో సంఖ్యాబలం ప్రదర్శనకే పరిమితమైందని విమర్శించారు. పార్టీ ఎమ్మెల్సీలతో చైర్మన్ పోడియం ఎక్కించి సమావేశాలకు అంతరాయం కలిగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. బీసీ వర్గాలకు భారీ కేటాయింపులు, పోలవరం, అమరావతి వంటి ప్రాజెక్టులకు నిధులు వంటి అనేక అంశాలు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ వాటిపై చర్చించేందుకు వైసీపీకి ఓపిక లేదని వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన బడ్జెట్‌పై సుహృద్భావ వాతావరణంలో చర్చించాల్సిన అవసరం ఉందని వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. కానీ శాసనమండలిలో రభస సృష్టించి బడ్జెట్‌పై దృష్టి మళ్లించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. వైసీపీ నాయకత్వానికి గొడవలే ముఖ్యమని ఘాటుగా విమర్శించారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ, శాసనసభలో సమయం ఇవ్వలేదని చెప్పి గైర్హాజరైన వైసీపీ సభ్యులు, శాసనమండలిలో సమయం ఉన్నప్పటికీ చర్చను అడ్డుకోవడం ఏ విధానమని ప్రశ్నించారు. చైర్మన్ పోడియం ఎక్కి రభస చేయడం అప్రజాస్వామిక చర్య అని ఖండించారు. కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో బడ్జెట్ రూపొందించిందని, దానిపై చర్చించేందుకు ధైర్యం లేక సభలో రచ్చ చేస్తున్నారని విమర్శించారు.

# అవసరమైన విషయాలపైనే శ్రద్ధ పెట్టాలి

- పదవ తరగతి విద్యార్థులకు సూచనలు

**వేద న్యూస్, రామడుగు:**



పదవ తరగతి విద్యార్థులు సమయపాలన పాటిస్తూ, ధ్యానం అలవాటు చేసుకుని చదువుపై దృష్టి కేంద్రీకరిస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలరని నిపుణులు సూచించారు. మండలంలోని గోపాల్రావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మ్యాక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఈ సూచనలు చేశారు. యువజన అవార్డు గ్రహీత గజ్జల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరీక్షల సమయంలో ఒత్తిడిని జయించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ విజయ్ రఘురామరాజు, మ్యాక్స్ ఫౌండేషన్ చైర్మన్ మహేష్, ఉపాధ్యాయులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా చెట్టు నరికిన వ్యాపారికి జరిమానా

**వేద న్యూస్, శాయంపేట:**



అటవీశాఖ అనుమతి లేకుండా చెట్టును నరికిన కలప వ్యాపారిపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని రూ.4,440 జరిమానా విధించారు. డిప్యూటీ రేంజర్ వై. కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం, హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామానికి చెందిన రైతు సంజీవరావు భూమిలో ఉన్న తుమ్మచెట్టును కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కలప వ్యాపారి బందారు ఓదేలు అనుమతి లేకుండా యంత్రంతో నరికాడు. ఈ విషయాన్ని పర్యావరణ పరిరక్షణ సంఘ సభ్యుడు మారపెల్లి సునీల్ అటవీశాఖ అధికారులకు తెలియజేయగా, సంఘటనా స్థలానికి చేరుకున్న డిప్యూటీ రేంజర్ విచారణ చేపట్టారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించినందుకు వ్యాపారి బందారు ఓదేలు పై కేసు నమోదు చేసి రూ.4,440 జరిమానా విధించినట్లు తెలిపారు.

# కేసీఆర్ బర్త్‌డే సెలబ్రేషన్స్

**వేద న్యూస్,జ్యోతి నగర్:**



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను మంగళవారం మేడిపల్లి చౌరస్తాలో ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు.ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ ఉద్యమకారులు, పార్టీని కొందరు వీడినా నిజమైన తెలంగాణవాదులు మాత్రం కేసీఆర్ వెంటనే ఉన్నారని స్పష్టం చేశారు. గులాబీ జెండా కింద ఐక్యంగా నిలబడి మరోసారి కేసీఆర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నినాదాలతో చౌరస్తా మార్మోగింది.

# చిన్న మంచితనం.. సమాజంలో పెద్ద మార్పు

- కరుణ, సహానుభూతి మానవీయతకు నిలువెత్తు నిదర్శనం
- అనుకోకుండా చేసిన సహాయం ఆశకు ఆరంభం
- పరస్పర గౌరవం, ఐక్యత శాంతియుత సమాజానికి పునాది

**వేద న్యూస్ డెస్క్:**

మనిషి గొప్పతనాన్ని కొలిచేది అతని సంపద కాదు, పదవి కాదు అతని దయ. మనసులోంచి వచ్చిన ఒక చిన్న మంచి చర్య ఎవరి జీవితాన్నైనా మారుస్తుంది. అలాంటి మానవీయ విలువలను గుర్తు చేస్తూ జరుపుకునే రోజే యాదృచ్ఛిక దయా చర్యల దినం. అనుకోకుండా చేసిన చిన్న సహాయం కూడా సమాజంలో పెద్ద మార్పుకు కారణమవుతుందని గుర్తు చేసే రోజు ఇది. ఇది కేవలం ఒక గుర్తింపు దినం మాత్రమే కాదు, మనసులను కలిపే పిలుపు.

నేటి కాలంలో ప్రతి ఒక్కరూ తమ పనుల్లో, బాధ్యతల్లో నిమగ్నమైపోతున్నారు. వేగవంతమైన జీవితం మనుషులను పరస్పర దూరం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో దయ అనే విలువ మరింత అవసరం. బస్సులో వృద్ధుడికి సీటు ఇవ్వడం, అవసరమైన వారికి ఆహారం అందించడం, చదువుకునే విద్యార్థికి సహాయం చేయడం, నిరాశలో ఉన్నవారికి ప్రోత్సాహకరమైన మాట చెప్పడం ఇవే యాదృచ్ఛిక దయా చర్యలు. ఇవి చిన్నవిగా కనిపించినా, వాటి ప్రభావం ఎంతో లోతైనది. దయకు ఖర్చు లేదు. కానీ దాని విలువ అమూల్యం. ఒక చిన్న సహాయం వల్ల ఎవరి మనసులోనైనా ఆశ వెలుగుతుంది. కష్టకాలంలో ఉన్న వ్యక్తికి ఒక చేయూత అందితే అతని జీవితం కొత్త దిశలో సాగవచ్చు. సమాజంలో పరస్పర సహకారం పెరిగితే విభేదాలు తగ్గుతాయి. కరుణ, సహానుభూతి, గౌరవం కలిసి సమాజాన్ని బలపరుస్తాయి. ఈ విలువలు లేకపోతే అభివృద్ధి అసంపూర్ణమే.

యాదృచ్ఛిక దయా చర్యల దినం మనకు ఒక ముఖ్యమైన సందేశం ఇస్తుంది. మంచి చేయడానికి ప్రత్యేక సందర్భం అవసరం లేదు. దయను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలి. చిన్న చర్యలు కూడా గొప్ప మార్పులకు నాంది కావచ్చు. ఒక మంచి పని మరో మంచి పనికి ప్రేరణ అవుతుంది. ఇలా దయ వ్యాపిస్తే సమాజంలో సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. పిల్లల్లో చిన్న వయసులోనే దయా భావం పెంపొందించాలి. కుటుంబాలు, పాఠశాలలు, సమాజం కలిసి ఈ విలువలను బోధించాలి. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, సహాయం చేయడం, పంచుకోవడం వంటి అలవాట్లు పెంపొందిస్తే భవిష్యత్ తరం మరింత మానవీయంగా మారుతుంది. మానవీయతతో కూడిన సమాజమే నిజమైన అభివృద్ధికి దారి తీస్తుంది.

నేటి ప్రపంచంలో విభేదాలు, అసహనం, ద్వేషం పెరుగుతున్నాయనే భావన ఉంది. అలాంటి పరిస్థితుల్లో దయ అనే చిన్న దీపం కూడా చీకటిని తొలగించగలదు. పరస్పర గౌరవం, సహకారం, కరుణ ఇవే శాంతియుత సమాజానికి పునాది. యాదృచ్ఛిక దయా చర్యలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి.మొత్తంగా యాదృచ్ఛిక దయా చర్యల దినం మనిషిలోని మానవీయతను మేల్కొలిపే రోజు. చిన్న సహాయం కూడా ఎవరికైనా ఆశను నింపగలదని గుర్తు చేసే రోజు. కరుణతో నిండిన హృదయాలే బలమైన సమాజాన్ని నిర్మిస్తాయి.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 18, 2026

# ఆ అందం వెనుక ఆవేదన తెలిస్తే కన్నీళ్లు ఆగవు?

## – మృణాల్ ఠాకూర్

**వేద న్యూస్ డెస్క్:**



వెండి తెరపై ఆమెను చూసినప్పుడు కనిపించేది ఒక స్వచ్ఛత, ఒక మృదుత్వం, ఒక సహజమైన ఆకర్షణ. సంప్రదాయ వస్త్రాల్లోనైనా, ఆధునిక వేషధారణలోనైనా ఆమె అందం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. ప్రస్తుతం యువత కలల కథానాయికగా వెలుగొందుతున్న ఈ నటి ఒకప్పుడు మాత్రం తనను తాను అద్దంలో చూసుకోవడానికే ఇష్టపడలేదంటే ఆశ్చర్యమే. ఆ నటి మరెవరో కాదుడ మృణాల్ ఠాకూర్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె తన జీవితంలోని మానసిక సంఘర్షణలను ఎంతో నిజాయితీగా వెల్లడించింది. సినీ పరిశ్రమలో కథానాయిక అంటే ఇలాగే ఉండాలి, ఒక నిర్దిష్టమైన ఆకృతి, ఒకే రకమైన అందపు ప్రమాణాలు ఉండాలనే అలిఖిత నిబంధనలు తనను తీవ్రంగా కలచివేశాయని మృణాల్ తెలిపింది. అందరూ తనను ప్రశంసిస్తున్నప్పటికీ, తనలో మాత్రం "నేను తక్కువనే" అనే భావన లోతుగా నాటుకుపోయిందని చెప్పింది. ఒకప్పుడు తాను కథానాయికగా నిలబడే అర్హతలే లేవేమోనని బాధపడిన రోజులను గుర్తు చేసుకుంది. ప్రపంచం అందానికి ఒకే కొలమానం పెట్టినప్పుడు, ఆ చట్రంలో ఇమడలేకపోతే మన మీద మనకే అపనమ్మకం పెరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇతరులతో తనను తాను పోల్చుకోవడం వల్ల తన ఆత్మవిశ్వాసం పూర్తిగా దెబ్బతిన్న దశలు ఉన్నాయని మృణాల్ చెప్పింది. తెరపై, బహిరంగ కార్యక్రమాల్లో నటులు ఎంతో ధైర్యంగా కనిపించినా, తెర వెనుక మాత్రం అనేక భయాలు, సందేహాలతో పోరాడుతుంటారని ఆమె స్పష్టం చేసింది. చాలామంది నటులు ఈ బాధలను బయటపెట్టకుండా లోపలే దాచుకుంటారని పేర్కొంది. ఎంత విజయాన్ని సాధించినా సరే, తన రూపం గురించి ఇతరులు ఏమనుకుంటారో అనే భయం వెంటాడుతూనే ఉంటుందని మృణాల్ వెల్లడించింది. ముఖ్యంగా ఈ రోజుల్లో సామాజిక మాధ్యమాల కారణంగా అందంపై ఒత్తిడి మరింత పెరిగిందని ఆమె అభిప్రాయపడింది. ప్రతి ఒక్కరూ ఒకరి రూపాన్ని విశ్లేషించడం, విమర్శించడం వల్ల సంపూర్ణంగా కనిపించాలనే తపన మనసును భారంగా మారుస్తోందని చెప్పింది. ఆన్‌లైన్‌లో వచ్చే పోలికలు, విమర్శలు మనిషిలో ఉన్న ఆత్మసందేహాన్ని మరింత పెంచుతాయని ఆమె హెచ్చరించింది. ముఖ్యంగా యువత అవాస్తవ అందపు ప్రమాణాలకు మోసపోకూడదని, వాటిని చేరుకోవాలని ఒత్తిడికి గురికావద్దని సూచించింది. మృణాల్ మాటలు వింటుంటే, విజయ శిఖరాల్లో ఉన్నవారికీ మానసిక పోరాటాలు తప్పవని అర్థమవుతుంది. అందం అనేది బాహ్య రూపంలో కాదని, మనసులోని ఆత్మవిశ్వాసంలోనే దాగి ఉందని ఆమె తన జీవితంతోనే నిరూపించింది. తన బలహీనతలను ధైర్యంగా అంగీకరించడమే ఈ రోజు ఆమెను ఇంతటి ఉన్నత స్థాయిలో నిలబెట్టిందని చెప్పొచ్చు.


# ఫిబ్రవరి 24న ఇంట్రో సాంగ్ రిలీజ్..




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. 'దసరా' తర్వాత ఈ జంట నుంచి వస్తున్న రెండో సినిమా కావడంతో అంచనాలు మరింత పెరిగాయి. చిత్ర బృందం తాజాగా ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈ సినిమాలోని పరిచయ గీతం 'ఆయా షేర్'ను ఫిబ్రవరి 24న విడుదల చేయనున్నారు. ఈ గీతానికి సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందించగా, సుధన్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో భారీ సెట్స్‌లో చిత్రీకరించారు. వందలాది మంది కళాకారులతో రూపొందించిన ఈ గీతం తెరపై ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. విడుదలకు ముందే ఈ గీతంపై మంచి ఆసక్తి ఏర్పడింది. సామాజిక నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో వెనుకబడిన గిరిజన వర్గాల సమస్యలపై పోరాడే నాయకుడిగా నాని శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నాడు. ఈ చిత్రంలో కాయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, మోహన్ బాబు, రాఘవ్ జుయెల్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తొలుత మార్చి 26న విడుదల చేయాలని భావించిన చిత్రాన్ని, నాణ్యత కోసం ఆగస్టు 21కు వాయిదా వేసినట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. పండుగల సీజన్‌లో విడుదల కావడం చిత్రానికి కలిసివస్తుందని నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# టాలీవుడ్‌లోకి ధ్రువ్ విక్రమ్ ఎంట్రీ..



**వేద న్యూస్ డెస్క్:**

తమిళ సినీ పరిశ్రమలో యువ నటుడిగా గుర్తింపు పొందిన ధ్రువ్ విక్రమ్ ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రముఖ నటుడు చియాన్ విక్రమ్ తనయుడిగా సినీ రంగంలోకి వచ్చిన ఆయన, ఇప్పటికే తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇస్తూ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుండగా, ఇది ప్రేమకథా వినోదాత్మక శైలిలో తెరకెక్కనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు దీపక్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనుండగా, కొత్త తరహా ప్రేమకథను వినోదంతో మిళితం చేసేలా కథను సిద్ధం చేసినట్లు సమాచారం. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రాన్ని రూపొందించే ఆలోచనలో నిర్మాతలు ఉన్నారని తెలుస్తోంది. ఇప్పటికే తమిళంలో 'మహాన్', 'బైసన్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ధ్రువ్ విక్రమ్, తెలుగులో కూడా తనదైన ముద్ర వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. చాలాకాలంగా పలువురు తెలుగు నిర్మాతలు ఆయనను టాలీవుడ్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నించినప్పటికీ, చివరకు ఈ కాంబినేషన్ సెట్ కావడం విశేషంగా మారింది. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉండగా, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. తెలుగు ప్రేక్షకులు కొత్త హీరో ఎంట్రీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## వేసవి బరిలో మెగా సినిమాలు..

# థియేటర్ల వద్ద భారీ పోటీ




**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఇటీవల వరుస విజయాలతో దూసుకెళ్తోంది. సంక్రాంతి కానుకగా విడుదలైన 'శంకర వరప్రసాద్' చిత్రం నాలుగు వందల కోట్లకు పైగా వసూళ్లు సాధించి టాలీవుడ్ శక్తిని మరోసారి చాటిచెప్పింది. ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ఈ వేసవి కాలంలో కూడా భారీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ముఖ్యంగా మెగా హీరోల సినిమాలు బాక్సాఫీస్ వద్ద హాట్ టాపిక్‌గా మారాయి. వేసవి రేసులో మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఇందులో పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మాస్ వినోదంగా రూపొందుతున్న ఈ చిత్రం మార్చి 26న విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' మే నెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు చిత్రాలపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీటితో పాటు ఏప్రిల్ 30న 'పెద్ది' చిత్రం కూడా విడుదలకు సిద్ధమవుతోంది. అంతేకాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'టాక్సిక్', 'ధురంధర్ 2', 'డెకాయిట్' వంటి చిత్రాలు కూడా వేసవి బరిలో నిలవనున్నాయి. అయితే ప్రధానంగా మెగా హీరోల చిత్రాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ వేసవిలో ఏ చిత్రం అతిపెద్ద విజయాన్ని సాధించి కొత్త రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.

# భారత జట్టుకు శుభవార్త.. స్టార్ ఓపెనర్ ప్రతీకా రావల్ పునరాగమనం

**వేద న్యూస్ డెస్క్:**




విదేశీ పర్యటనలో విజయాల జోరు కొనసాగిస్తున్న భారత మహిళల క్రికెట్ జట్టుకు శుభవార్త అందింది. గాయంతో మూడు నెలలకు పైగా జట్టుకు దూరమైన స్టార్ ఓపెనర్ ప్రతీకా రావల్ తిరిగి జట్టులోకి రానుంది. ప్రపంచకప్ లీగ్ దశలో గాయపడిన ఆమె తాజాగా పూర్తిగా కోలుకుని మళ్లీ పోటీలకు సిద్ధమైంది. పాద గాయం కారణంగా కీలక మ్యాచ్‌లకు దూరమైన ప్రతీకా రావల్ పునరుద్ధరణ శిబిరంలో సాధన చేసి ఫిట్‌నెస్ సాధించింది. శిక్షణ కేంద్రం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో ఎంపికదారులు ఆమెను ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఇరవై ఓవర్ల సిరీస్ ముగిసేలోపే ఆమె జట్టుతో కలవనుంది. తక్కువ సమయంలోనే ఓపెనర్‌గా స్థిరపడిన ప్రతీకా తన దూకుడు ఆటతో జట్టుకు బలమైన ఆరంభాలు అందించింది. ఆమె పునరాగమనం బ్యాటింగ్ విభాగానికి మరింత బలం చేకూర్చనుందని జట్టు వర్గాలు భావిస్తున్నాయి. మార్చి 6న ప్రారంభమయ్యే పెర్త్ టెస్టులో కూడా ఆమె ఆడే అవకాశం ఉంది. భారత మహిళల వన్డే జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వం వహిస్తుండగా, స్మృతి మంధాన ఉపనాయకురాలిగా కొనసాగుతున్నారు. ప్రతీకా రావల్ రాకతో కంగారూ నేలపై భారత జట్టు మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.

# పదో తరగతి పరీక్షలకు వైభవ్ సూర్యవంశీ డుమ్మా!

**వేద న్యూస్ డెస్క్:**




యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ ఏడాది పదో తరగతి బోర్డు పరీక్షలకు హాజరు కావడం లేదు. ఇటీవల ముగిసిన పద్దెనిమిదేళ్ల లోపు ప్రపంచ కప్ పోటీల్లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందిన ఆయన ప్రస్తుతం రాబోయే భారతీయ ప్రీమియర్ లీగ్ పోటీలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పరీక్షలకు సరైన సిద్ధత సాధ్యం కాకపోవడంతో ఈసారి పరీక్షలను వదిలేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. బీహార్ రాష్ట్రంలోని తాజ్‌పూర్ ప్రాంతంలో చదువుతున్న సూర్యవంశీ గత కొంతకాలంగా వరుస క్రికెట్ పోటీలతో బిజీగా ఉన్నాడు. పద్దెనిమిదేళ్ల లోపు ప్రపంచ కప్‌లో అతని బ్యాటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫైనల్ పోటీలో అతను వేగవంతమైన శతకం సాధించి జట్టుకు కీలక విజయాన్ని అందించాడు. మొత్తం పోటీల్లో ఏడు మ్యాచ్‌లలో భారీ పరుగులు సాధించి ప్రతిభ చాటుకున్నాడు. ప్రస్తుతం నాగపూర్‌లో జరుగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న సూర్యవంశీ రాబోయే లీగ్ పోటీల కోసం కఠినంగా సాధన చేస్తున్నాడు. రాజస్థాన్ జట్టు తరఫున ఆడనున్న అతను తన ఆటపై పూర్తి దృష్టి పెట్టడంతో ఈ ఏడాది విద్యా పరీక్షలను వదిలేయాల్సి వచ్చినట్లు కోచ్ వర్గాలు తెలిపాయి. క్రీడా రంగంలో ముందుకు సాగేందుకు యువ ఆటగాడు తీసుకున్న ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఆస్ట్రేలియా కొంపముంచిన వర్షం..




**వేద న్యూస్ డెస్క్:**

పురుషుల ఇరవై ఓవర్ల ప్రపంచకప్‌లో సూపర్ 8 దశపై ఆశలు పెట్టుకున్న ఆస్ట్రేలియా జట్టుకు వర్షం పెద్ద షాక్ ఇచ్చింది. పల్లెకెలె మైదానంలో జరగాల్సిన ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్ కుండపోత వర్షం కారణంగా రద్దు కావడంతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ ఫలితంతో జింబాబ్వే జట్టు ఐదు పాయింట్లతో తదుపరి దశకు అర్హత సాధించగా, మాజీ విజేత ఆస్ట్రేలియా టోర్నీ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ ప్రారంభం కాకముందే వర్షం ఆగకపోవడంతో టాస్ కూడా వేయకుండా అంపైర్లు ఆటను రద్దు చేశారు. ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించడంతో జింబాబ్వే పాయింట్ల పట్టికలో ముందంజ వేసింది. ఇదే ఆస్ట్రేలియా అవకాశాలను పూర్తిగా దెబ్బతీసింది. గత మ్యాచ్‌లలో వచ్చిన ఓటములు కూడా కంగారూ జట్టుకు భారంగా మారాయి.

# కెనడాపై న్యూజిలాండ్ విజయం..

**వేద న్యూస్ డెస్క్:**




టీ20 ప్రపంచ కప్‌లో కెనడాతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు అద్భుత ప్రదర్శనతో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై వేదికగా జరిగిన ఈ పోటీలో కివీస్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ అర్ధశతకాలతో జట్టును సులభ విజయానికి తీసుకెళ్లారు. ఈ గెలుపుతో న్యూజిలాండ్ సూపర్-8 దశకు అర్హత సాధించింది. టాస్ గెలిచిన కెనడా ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. యువ బ్యాటర్ యువరాజ్ సమ్రా దూకుడుగా ఆడి 65 బంతుల్లో 110 పరుగులు సాధించాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 బౌండరీలు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. సమ్రా, బజ్వా మధ్య తొలి వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యం నెలకొనడంతో కెనడా నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. రచిన్ రవీంద్ర 39 బంతుల్లో 59 పరుగులు చేయగా, గ్లెన్ ఫిలిప్స్ 36 బంతుల్లో 77 పరుగులతో అజేయంగా నిలిచాడు. మూడో వికెట్‌కు వీరిద్దరూ కలిసి 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో న్యూజిలాండ్ కేవలం 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో కివీస్ జట్టు తదుపరి దశకు ధైర్యంగా అడుగుపెట్టింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073